క్లుప్తంగా

చెస్ విజేతలకు అభినందన



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల చదరంగం పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎ.ఉషాప్రవల్లిక, ఎస్.సాధన, ఎన్.సరయు, ఎం.కీర్తి సత్తా చాటి పతకాలు సాధించారని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ క్రీడా విభాగాధిపతి డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. వీరిలో ఎ.ఉషాప్రవల్లిక, ఎస్.సాధన దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా వర్సిటీ జట్టులో చోటు దక్కించుకున్నారన్నారు. ప్రతిష్టాత్మకమైన వర్సిటీ చెస్ టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు కాలేజీ ప్రాంగణంలో సోమవారం అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో శారద విద్యార్థుల ప్రతిభ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ సత్యసాయి సేవా సమితి రైల్వే సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శారద జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహించిన పోటీల్లో కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచారు. తెలుగు వ్యాసరచన పోటీల్లో కళాశాలకు చెందిన బి.తనూజ, ఎన్.స్వాతి, బి.దివ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంగ్లిష్ వ్యాసరచన పోటీల్లో కె.వాగ్దేవి తన్మయి, ఎస్కే రెహానా, బి.అంకిత్ తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ వై.రాజేష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయిలోనూ తమ సత్తా చాటాలని విద్యార్థులకు సూచించారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా గోపి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా విజయవాడ నగరానికి చెందిన యాగంటి వెంకట గోపి ఎన్నికయ్యారు. గోరఖ్‌పూర్‌లో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఏబీవీపీ 70వ జాతీయ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగిందని వెంకట గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ విజయవాడ నగర కార్యదర్శిగా, ఏబీవీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్‌గా విద్యార్థుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించానన్నారు. పరిషత్ రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న తనకు పరిషత్ జాతీయ కమిటీలో బాధ్యతలు అప్పగించినందుకు కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ పరిధి, నల్లగేటు ఫీడర్ లైన్‌లోని 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడంకివారివీధి, రామాలయంవీధి, గడియారంవారివీధి, అబ్బూరువారివీధి, వ్యాకరణంవారివీధి, ముదిగొండవారివీధి, తిరుమలశెట్టివారివీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ప్రమాదకర చెట్ల కొమ్మలు తొలగింపు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని సమానంవారివీధిలో ఎన్నో ఏళ్లుగా ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను సోమవారం విద్యుత్, నగరపాలకసంస్థ సిబ్బంది తొలగించారు. డివిజన్ పర్యటనలో భాగంగా స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి సమానంవారివీధిలో పర్యటించిన సందర్భంలో చెట్ల కొమ్మలు పెరిగి విద్యుత్ లైన్‌లపై పడటంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ విషయాన్ని విద్యుత్ శాఖ, నగరపాలకసంస్థ ఉద్యానవనశాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయా శాఖలు సమన్వయంతో చెట్ల కొమ్మలను తొలగించారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ సమస్యకు పరిష్కారం దొరకటంతో స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పడకేసిన పనులు



పాఠశాలలో నిరుపయోగంగా ఫ్లోరింగ్ రాళ్లు



నిరుపయోగంగా మారిన వాష్ బేసిన్



కనీసం గేటుకు రంగులు వేయకపోవడంతో తుప్పుపట్టిన దృశ్యం

గొట్టిముక్కల సూర్యనారాయణరాజు పాఠశాలలో నిలిచిన నాడు – నేడు పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో నాడు – నేడు పనులు నిలిచిపోయాయి. గొట్టుముక్కల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 500 మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక సదుపాయాల కల్పనకు నాడు–నేడు పథకంలో భాగంగా రూ. 64 లక్షలు మంజూరు చేశారు. గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలకు సైతం రూ. 14 లక్షలు మంజూరు చేశారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల చొరవతో నాడు– నేడు పనులు పూర్తి చేశారు. హైస్కూల్లో పనులు త్వరితగతిన జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావటం ప్రభుత్వం మారింది.



గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాల

పట్టించుకునే వారే లేరు

నాటి నుంచి ఇక్కడ పనులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో నాడు– నేడు పనులు నత్తనడకన సాగాయి. ఇటీవల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి.గత ప్రభుత్వ హయంలో వచ్చిన ఫ్లోరింగ్ రాళ్లను కూడా ఇప్పటికీ వేయించకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియ జేస్తోంది. దాతలు అందజేసిన వాష్‌బేసిన్‌లకు ఏర్పడిన చిన్నపాటి మరమ్మతులను కూడా పూర్తి చేయకపోవటం గమనార్హం. గేటుకు కనీసం రంగులు కూడా వేయించలేదు. ఇక్కడ కనీసం పనులు ఎంతవరకు పూర్తయ్యాయో కూడా చెప్పలేని స్థితిలో హైస్కూలు ఇన్‌చార్జి ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాడు–నేడు పనులు వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



చిట్టినగర్‌లో ఫిర్యాదును స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ అందించే మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కర కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

సమస్యలపై 13 ఫిర్యాదులు..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా, ఫిర్యాదు చేసిన వారి వద్దకు వెళ్లి పరిశీలించి, సమస్యకు పరిష్కారం చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదులను ఆయన స్వీకరిస్తూ, అక్కడున్న అధికారులతో సర్కిల్ – 1 పరిధిలో ఉన్న సమస్యల గురించి చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్కిల్ 2, 3, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ఫిర్యాదుల స్వీకరణను పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సర్కిల్–1 కార్యాలయంలో రెండు ఫిర్యాదులు, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు అందాయి. వాటిలో ప్రధానంగా ఇంటి పన్నులు, డోర్ నెంబర్ కరెక్షన్స్, అనధికార కట్టడాలు, ఆక్రమణలు, తాగునీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. సర్కిల్ –1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్‌తో పాటు జోనల్ కమిషనర్–1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ రెడ్డి, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ హెలెన్, శానిటరీ సూపర్‌వైజర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వైభవంగా సంగీత మహోత్సవాలు



వాగ్గేయకారుల కీర్తనలు గానం చేస్తున్న మల్లాది బ్రదర్స్

విజయవాడకల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రంలోని విద్యాభారతి శ్రవణసదనంలో నిర్వహిస్తున్న 31వ వార్షిక సంగీతోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. విఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సోదరులుగా ప్రసిద్ధి చెందిన మల్లాది శ్రీరామ ప్రసాద్, మల్లాది రవికుమార్‌లు నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. స్వీయ రచనలతో పాటు సంగీత త్రిమూర్తులు సద్గురు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామ శాస్త్రిలు రచించిన సంకీర్తనలను గానం చేశారు. లాల్‌గుడి జయరామన్ వర్ణం, త్యాగరాజ స్వామి కీర్తన పలకవేమి నాదైవమా చనితోడి తేవే తదితర కీర్తనలు ఆలపించారు. మల్లాది సూరిబాబు సంగీత వారసులు సింధురాగేశ్వరి, అరవింద్, శివానంద యశస్వి వాద్య సహకారం అందించారు. శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్, సంస్థ కోశాధికారి జేఎస్ఎస్ ప్రసాద్ శర్మ నిర్వహించారు. సంగీత విద్వాంసులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

నేటి కార్యక్రమం

డాక్టర్ ముప్పవరపు సింహాచల శాస్త్రికి హరికథా చతురాన బిరుదు ప్రదానంతో పాటు డాక్టర్ కే వాగీష్ గాత్రం కార్యక్రమాలు జరుగుతాయి.

సోషల్ మీడియాలో మంచిని మాత్రమే అనుసరించాలి

మంత్రి కొలుసు పార్థసారథి



ఎస్ఆర్ఆర్ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): యువతీ యువకులు సోషల్ మీడియాలో ఉన్న చెడు వైపు వెళ్లకుండా మంచిని మాత్రమే అనుసరిస్తూ తమ జీవితాలను సన్మార్గంలో తీర్చిదిద్దుకోవాలని సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాలలో సోమవారం సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, వాటి ప్రభావం అనే అంశంపై అవగాహన వర్కుషాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సోషల్ మీడియా దుర్వినియోగంపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవల కాలంలో స్మార్ట్ ఫోన్‌ల వినియోగం వలన మానవ సంబంధాలు చాలా దెబ్బతింటున్నాయని చెప్పారు. గతంలో కుటుంబమంతా కలిసి ఎంతో ఆనందంగా గడిపే వాళ్లమని, ఇప్పుడు ఎవరి గదుల్లో వారు స్మార్ట్ ఫోన్‌తో ఉండటానికి ఇష్టపడుతూ సోషల్ మీడియాకు ఎడిక్ట్ అయిపోతున్నారన్నారు. సోషల్ మీడియాలో చెడు గురించి ఎక్కువగా మాట్లాడే వారికి నేడు ఆదరణ ఎక్కువగా ఉంటోందని, అలాంటి విషయాలను యువత ఖండించాలని చెప్పారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారంను యువత విద్య, ఉపాధి, కమ్యూనికేషన్‌కు వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు బాగా పెరుగుతున్నాయని అటువంటి వారినిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అసభ్యకర పోస్టులు పెట్టడం, వాటిని ఫార్వర్డ్ చేయడం కూడా నేరమనని అటువంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, కార్పొరేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ విద్యార్థులు ఔషధ పరిశోధనలపై దృష్టి సారించాలని సంజయ్ బయోటెక్ ఫార్మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ తెలిపారు. నగరంలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో వారం రోజుల పాటు జరిగిన జాతీయ ఫార్మసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఎం.లక్ష్మీప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లను పరిశీలించారు. నూతన ఆవిష్కరణలపై పోస్టర్లను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో భవిష్యత్తులో తయారీ, ఎగుమతుల రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్స్, గెస్ ద డ్రగ్, వక్తృత్వం, డ్రాయింగ్, డ్రగ్ కన్వర్‌జేషన్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, కార్యక్రమ సమన్వయకర్త ఎన్.కనకదుర్గాదేవి, డాక్టర్ జి.రమణ పాల్గొన్నారు.

నేడు ఎస్‌బీఐ టౌన్ హాల్ మీటింగ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వినియోగదారుల సమస్యలు, పరిష్కారాలు, సైబర్ మోసాలు, ఇతర బ్యాంకింగ్ సమస్యలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం టౌన్ హాల్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంక్ మెట్రో రీజియన్ ఆర్ఎం సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీరోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీపార్క్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశంలో బ్యాంకు వినియోగదారులు పాల్గొని, బ్యాంకింగ్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు తెలుసుకోవచ్చన్నారు. వినియోగదారులకు బ్యాంకు అందించే సౌకర్యాలపై అవగాహన పొందవచ్చన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చండి



అర్జీలు చూపుతున్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు డిమాండ్ చేశారు. ఇల్లులేని పేదలకు సొంత ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లోని హోచిమిన్ భవనం వద్ద పేద ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే నగరాల్లో ఇల్లు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం, గ్రామాల్లో మూడు సెంట్లు, నిర్మాణానికి 4 లక్షల రూపాయలు కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా దాని గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. పేదలకు ఇస్తామన్న భూమిని ఇవ్వడంతో పాటుగా ప్రస్తుతం పెరిగిన ఇసుక, కంకర, ఐరన్, రేట్లు దృష్టిలో ఉంచుకొని ఇల్లు కట్టుకునేందుకు రూ.4 లక్షలకు బదులు రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో అర్జీదారులందరూ 27వ తేదీన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వ్యక్తిగతంగా తమ అర్జీలను సమర్పించనున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు గురవయ్య, కంది ఆదినారాయణ, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయొద్దు



తొలగించిన బడ్డీ కొట్లను పరిశీలిస్తున్న నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కండ్రిక 64వ డివిజన్‌లో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న 12 బడ్డీ కొట్లను కూటమి ప్రభుత్వం తొలగించటం సరైన పద్ధతి కాదని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు, సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అన్నారు. కండ్రిక రోడ్డులో కార్పొరేషన్ అధికారులు బడ్డీ కొట్లు తొలగిస్తున్న విషయాన్ని తెలుసుకున్న వారు సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత విజయవాడ నగరంలో అనేక ప్రాంతాల్లో చిరు వ్యాపారస్తుల వ్యాపారాలను ధ్వంసం చేస్తూ వారి ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి చూపించాల్సిన వారే ఈ రకంగా వ్యవహరించడం దారుణమని, కార్మికుల పొట్టకొడితే కార్మిక లోక ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికావాల్సివస్తుందని హెచ్చరించారు. తొలగించిన బడ్డీ కొట్లను యథాస్థానంలో వ్యాపారాలు చేసుకొనుటకు అనుమతించాలని సంబంధిత అధికారులను కోరారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు జి.ఝాన్సీ రాణి, సీహెచ్ శ్రీనివాస్, పి.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



మహా శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు వేలాదిగా ఆలయాలను దర్శించుకున్నారు. లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ నాగసాయిబాబా ఆలయంలోని మహా శివలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాల పరిసరాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహా శివలింగానికి లక్షలాది పూలతో అభిషేకాలు, విభూతి అభిషేకం చేపట్టారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..

చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో కార్తిక సోమవారం సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కార్తికం.. పరమ పవిత్రం..

పరమ పవిత్రమైన కార్తికమాసం నాల్గో సోమవారం సందర్భంగా విజయవాడ దుర్గఘాట్ వద్ద కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఘాట్‌కు తరలివచ్చారు. నదిలో స్నానాలు చేసి కార్తిక దీపాలు వదిలారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

స్టెల్లాలో సంప్రదాయ పోటీలు



ఎథ్నిక్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని స్టెల్లా కళాశాలలో జరుగుతున్న కల్చరల్ వీక్‌లో భాగంగా సోమవారం ఎథ్నిక్ డే పోటీలు జరిగాయి. పోటీలకు నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల సంప్రదాయాలను ఉట్టిపడేలా, సంస్కృతి ప్రతిబింబించేలా వస్త్రధారణతో చూపరులను ఆకట్టుకున్నారు. పోటీలకు కళాశాల అధ్యాపకురాలు సుప్రియ, నసీరున్నీసా, స్వరూపారాణి, డాక్టర్ జ్వాలా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో ఆశా, హర్షిత, తన్వి, వైష్ణవి, దీప్తి ప్రియ గెలుపొందారు. కళాశాల యాజమాన్యం వారికి బహుమతులు ప్రదానం చేసింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ భారత జ్యోతి, మంజుల, శారకుమారి, ఆయేషా, శాంతి శ్రీ, గౌతమి, అంజనీ సింహ, కృష్ణ మనోహర్ పాల్గొన్నారు.

ఆచంట సేవలు ఆదర్శనీయం



ఆచంట విగ్రహానికి నివాళులర్పించిన హరగోపాల్, గోళ్ల నారాయణరావు, రావి వెంకట్ తదితరులు

విజయవాడకల్చరల్: రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు తెలిపారు. నాటక రంగస్థల ప్రముఖుల సమక్షంలో రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు 9వ వర్ధంతి సభను తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో ఆచంట విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ పద్యనాటకంలో ఆయన చేసిన ప్రయోగాలు మరెవరూ చేయలేదన్నారు. రావి వెంకట్ మాట్లాడుతూ ఆయనలోని ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఆయనకు పలు అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. పద్యనాటకం పేరు చెబితే ముందుగా గుర్తుకు వచ్చేది ఆచంట వెంకటరత్నం నాయుడు అని చెప్పారు. కార్యక్రమంలో ఆచంట వెంకటరత్నం నాయుడు కుమారుడు ఆచంట బాలాజీ నాయుడు, ఐక్యకాపునాడు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోనరావు, అంబటి మధుమోహన కృష్ణ, కంది గంగాధర్, బొజ్జా శంకర్, పెన్నేరు దామోదర్, చివుకుల హరగోపాల్ పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఘనంగా ముగిసిన భోగ శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ



విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భోగశ్రీనివాసుని సంప్రోక్షణ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. భక్తులు గోవిందనామాలు ప్రతిధ్వనిస్తూ ఉండగా వేద పండితులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మహా పూర్ణాహుతి వరకు జరిగే వైదిక క్రతువు, కళావాహన, అక్షతారోహణ, బ్రహ్మఘోష తదితర కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ శాస్త్ర పండితులు నల్లూరి మోహన వెంకట రంగాచార్యులు, కామకన భట్టార్, ఆర్‌బీఎంకేఎస్ అయ్యన్న, సూర్యకుమారా చార్యులు నిర్వహించారు. అర్చకులను దేవాలయం అధికారులు ఘనంగా సత్కరించారు. టీటీడీ దేవస్థాన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి పర్యవేక్షించారు.